సాక్షి సంగారెడ్డి

గురువారం ; 29 ; ఫిబ్రవరి ; 2024



అనగనగా ఈరోజు

నాలుగేళ్లకోసారి వచ్చే లీపు సంవత్సరం (ఫిబ్రవరి 29) అంటే అందరూ ప్రత్యేక రోజుగా పరిగణిస్తారు. గురువారం లీపు సంవత్సరం సందర్భంగా ప్రత్యేక కథనం. వివరాలు 8లో ▸



జాగిలాల పనితీరు...

నేరస్తులను పసిగట్టడంలో పోలీసు జాగిలాల పనితీరు ప్రశంసనీయమని సీపీ అనురాధ తెలిపారు. పోలీసు జాగిలాలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివరాలు 8లో ▸



సృజనాత్మతకు సైన్స్ ఫేర్..

జిల్లా వ్యాప్తంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా చేసుకున్నారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్ బదిలీ

జహీరాబాద్: నిమ్జ్ యూనిట్–2 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వసంతకుమారి బదిలీ అయ్యారు. బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆమెను సంగారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారిగా బదిలీ చేశారు. వసంతకుమారి ఇటీవలే బదిలీపై వచ్చినా ఆమెను మళ్లీ బదిలీ చేశారు. ఆమె స్థానంలో సంగారెడ్డి డివిజనల్ అధికారి రవీందర్‌రెడ్డిని నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు. ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు.

దేశహితం కోసం పాటుపడితేనే గుర్తింపు



చిత్రపటాన్ని అందుకుంటున్న తల్లోజి ఆచారి

నారాయణఖేడ్: దేశహితం కోసం పాటుపడే కార్యకర్తలకు ఎల్లప్పుడే గుర్తింపు ఉంటుందని ఓబీసీ జాతీయ కమిషన్ సభ్యుడు తల్లోజి ఆచారి అన్నారు. ఏబీవీపీ పూర్వ నాయకుడు నిలేష్ స్వామి ఆశ్రమాన్ని ఆయన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్పతో కలిసి సందర్శించారు. నీలేష్ స్వామి వారిని సన్మానించి దేవుళ్ల చిత్రపటాలను బహూకరించారు. పూర్తిసమయ కార్యకర్తగా ఏబీవీపీలో సమయం ఇచ్చిన నీలేష్ కృషి ప్రశంసనీయమన్నారు. బీజేపీ ఓబీసీమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిరాం తల్లోజి ఆచార్యను సన్మానించారు.

హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ ఆగ్రహం వ్యక్తంచేశారు. సదాశివపేట పారిశ్రామిక ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వ అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రజల నుంచి సేకరించిన పదివేల సంతకాలను జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ బుధవారం మల్లికార్జున్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను పెట్టుబడిదారులకు అనుకూలంగా చేస్తుందని వాపోయారు. పదివేల సంతకాలను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు మల్లేశం, సాయిలు, జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య, ప్రవీణ్ కుమార్, నాయకులు మైపాల్ తదితరులు పాల్గొన్నారు.

యువత భాగస్వామ్యం అవసరం



మాట్లాడుతున్న రంజిత్ రెడ్డి

సంగారెడ్డి టౌన్: ప్రజాస్వామ్య పరిరక్షణకు యువత భాగస్వామ్యం కావాలని ఉమ్మడి జిల్లా యువజన అధికారి రంజిత్ రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో యూత్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, సుపరిపాలన ఆచరణకు యూత్ పార్లమెంట్‌లు కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. పార్లమెంటరీ సంస్థల పనితీరును యువత అర్థం చేసుకునేందుకు యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వశాఖ జిల్లా స్థాయిలో యూత్ పార్లమెంట్ నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో 33వ బెటాలియన్ సుబేధార్ మేజర్ రాంహరి, మాలిబర్ సింగ్, రాకేశ్ కేసి, 'బేటీ బచావో బేటీ పడావో' అధికారి పల్లవి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన అవసరం

మెదక్‌మున్సిపాలిటీ/శివ్వంపేట(నర్సాపూర్): ప్రతి విద్యార్థి సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని డీఈఓ రాధాకిషన్ అన్నారు. బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శివ్వంపేట, గూడూర్‌తో పాటు పలు పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని.. మూఢ నమ్మకాలను నమ్మొద్దని సూచించారు. పరీక్షల కాలం సమీపిస్తున్నందున ఏకాగ్రతతో చదవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఆధారపడి ఉందన్నారు. కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలన్నారు. సమయం వృథా చేసుకోకుండా ఉత్తమ ర్యాంకుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. శివ్వంపేటలో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు.

జిల్లాలో ప్రధాని మోదీ పర్యటన

5న బహిరంగసభ

- జాతీయ రహదారి జాతికి అంకితం
- సభా స్థలాలను పరిశీలించిన నాయకులు
- సింగూరు ప్రాజెక్టు అభివృద్ధికి నిధులు?
- రింగ్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన?



గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ప్రధాని నరేంద్రమోదీ మార్చ్ 5న జిల్లాకు రానున్నారు. రూ.3,503 కోట్ల వ్యయంతో నిర్మించిన 161వ జాతీయ రహదారిని ఆయన జాతికి అంకితం చేయనున్నారు. సంగారెడ్డి సమీపంలోని మామిడిపల్లి నుంచి అకోలా వరకు ఈ రహదారిని నిర్మించారు. భారత్‌మాల పథకంలో భాగంగా హైదరాబాద్ – ఇండోర్ ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా ఈ రహదారిని నిర్మించారు. మోదీ జాతికి అంకితం చేయనున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. అలాగే జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు కూడా ప్రధాని శంకుస్థాపనలు చేయనున్నారు. సింగూరు ప్రాజెక్టు వద్ద పర్యాటక అభివృద్ధి కోసం నిధులు మంజూరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చేపట్టిన రీజనల్ రింగ్ రోడ్డు వంటి పనులకు సంబంధించి శంకుస్థాపనలు చేసే అవకాశాలున్నాయి.

జిల్లాలో బహిరంగసభ

జిల్లాలో బహిరంగసభను నిర్వహించాలని నిర్ణయించారు. మోదీ మార్చ్ 5న ఉదయం 10.15కు బేగంపేట్ ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి సంగారెడ్డికి చేరుకుంటారు. ఇక్కడ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల శిలాఫలాలను ఆవిష్కరిస్తారు. ఉదయం 11.25కు బహిరంగ సభా స్థలానికి చేరుకుంటారు. 11.30 నుంచి 12.15 వరకు ప్రసంగిస్తారు. అనంతరం బెగంపేట్ ఎయిర్‌పోర్టుకు చేరుకుని అక్కడి నుంచి ఒడిసాకు బయలుదేరి వెళతారు.

సంగారెడ్డిలోనా? పటాన్‌చెరులోనా?

మోదీ పర్యటన సందర్భంగా నిర్వహించతలపెట్టిన బహిరంగసభను సంగారెడ్డిలో నిర్వహించాలా? పటాన్‌చెరులో నిర్వహించాలా అనే దానిపై పార్టీ వర్గాలు యోచిస్తున్నాయి. సంగారెడ్డిలోని స్టేడియం, తారా డిగ్రీకళాశాల గ్రౌండ్‌లను ఎంపిక చేయాలని భావించారు. అయితే ప్రజలు రావడానికి సరైన రోడ్డు మార్గం లేదు. ట్రాఫిక్ జాం అయ్యే అవకాశం ఉంది. ప్రధాని మోదీ సభ కావడంతో వందల సంఖ్యలో వాహనాలు వచ్చే అవకాశాలున్నాయి. దీంతో పటాన్‌చెరు సమీపంలోని ఎస్‌ఆర్ ఇన్ఫినిటీ వద్ద ఉన్న స్థలంలో ఈ బహిరంగసభను నిర్వహించే యోచనలో ఉన్నారు. వాటిని బుధవారం కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు సి.గోదావరి, ఇతర నాయకులు పరిశీలించారు.

నేడు పార్లమెంట్ స్థాయి కీలక సమావేశం

మోదీ పర్యటన నేపథ్యంలో గురువారం సంగారెడ్డిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బీజేపీ ముఖ్య నేతల సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశానికి రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌తో పాటు, మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని ముఖ్య నాయకులు హాజరు కానున్నారు. మోదీ పర్యటనపై ఈ సమావేశంలో నిర్ణయాలు తీసుకునే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



ఎన్నికల్లో విజయమే లక్ష్యం

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా దూకుడు మీదున్న బీజేపీ జిల్లాలో మోదీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని భావిస్తోంది. ఇప్పటికే ఆ పార్టీ విజయసంకల్ప యాత్ర జిల్లాలో కొనసాగుతోంది. మార్చ్ 3 వరకు ఈ యాత్రలు రాష్ట్ర వ్యాప్తంగా ముగిసే అవకాశాలున్నాయి. ఈ యాత్ర ముగిసిన రెండు రోజులకే మోదీ జిల్లా పర్యటన ఖరారు కావడం గమనార్హం. మరో పక్షం రోజుల్లో పార్లమెంట్ ఎన్నికల నగారా మోగే తరుణంలో ఈ మోదీ సభను నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది.



సంగారెడ్డి అర్బన్: పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ క్రాంతి

95.78 శాతం హాజరు

- మొదటి రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం
- ఆలస్యంగా వచ్చిన విద్యార్థినికి నిరాశే

సంగారెడ్డి అర్బన్ /పటాన్‌చెరు టౌన్: పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. బుధవారం నుంచి ప్రారంభమయిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలలో భాగంగా పరీక్షలు జరుగుతున్న కాలేజీలలో సంగారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు), శ్రీతేజ ప్రైవేట్ కళాశాలలను కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరును పరిశీలించారు. అ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 18,780 మందికి గాను 17,988 మంది పరీక్షలకు హాజరయ్యారని, 792 మంది గైర్హాజర్ అయ్యారని తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షకు 95.78 శాతం విద్యార్థులు హాజరయ్యారని, పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించామని, విద్యార్థులకు విద్యార్థులకు హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేశామని చెప్పారు. సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మొదటిరోజు ఇంటర్ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు. ఆమె వెంట ఇంటర్మీడియట్ అధికారి గోవింద్ రామ్, తహసీల్దార్ దేవదాస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత ఉన్నారు.

పటాన్‌చెరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, సెయింట్ జోసెఫ్ హైస్కూల్, ఇంద్రేశం వీఎస్ఆర్ స్కూల్, ముత్తంగి మహాత్మ జ్యోతీరావు పూలే, చిట్కుల్ గురుకుల కళాశాల, శాంతినికేతన్ స్కూల్, మంజీరా కాలేజ్, ఇస్నాపూర్ గురుకుల మొత్తం 8పరీక్ష కేంద్రాల్లో 3,715 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 3,659 మంది హాజరయ్యారు. 56 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండల పరిధిలోని బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 896 విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 875 మంది హాజరయ్యారు. 21 మంది గైర్హాజరయ్యారు.

అలస్యంగా వచ్చి వెనుదిరిగిన విద్యార్థిని

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రానికి రామచంద్రపురం గీతా భూపాల్ రెడ్డి కాలేజీకి చెందిన సునాయిత్రి 9 దాటిన తర్వాత పరీక్ష కేంద్రానికి వచ్చింది. అప్పటికి గేటు మూసి వేసిన నిర్వాహకులు ఆమెను లోనికి అనుమతించలేదు. దీంతో బాధగా వెనుదిరిగింది.

మాది అవినీతి రహితపాలన



భహిరంగ సభలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

- పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

జహీరాబాద్: పదేళ్లలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అవినీతి రహిత పాలన అందించారని, వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఘనవిజయం చేకూర్చిపెట్టాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కోరారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన ప్రజా సంకల్పయాత్ర సభలో ఆయన మాట్లాడారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘతన కూడా మోదీకే దక్కిందన్నారు. గ్రామాల అభివృద్ధికి ఆర్థిక సంఘం నిధులు ఇచ్చారన్నారు. దేశంలో ఉగ్రవాదం, మత ఘర్షణలులేని పాలన అందించారని ప్రశంసించారు. దేశంలో ఎంతో మార్పు వచ్చిందని, అభివృద్ధి వైపు అడుగులు వేస్తోందన్నారు. మార్చి 5న ప్రధానమంత్రి సంగారెడ్డికి వస్తున్నారని, రూ.10వేల కోట్ల రహదారుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయబోతున్నారని చెప్పారు. ఈ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి ఓటు వేస్తే మోదీ మూడోసారి ప్రధాని అవుతారన్నారు. ప్రజలకు ఈ విషయం చెప్పేందుకే ప్రజా సంకల్ప యాత్ర చేపట్టామని చెప్పారు. ప్రజలు మోదీకి అండగా నిలబడాలని కోరారు. అనంతరం కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వంద రోజులు కావస్తున్నా ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీలు అని చెప్పినా అమలు కావడం లేదని, రైతులను పూర్తిగా విస్మరించారని విమర్శించారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వలేకపోతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి పట్టం కట్టాలని కోరారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం.జైపాల్‌రెడ్డి, బీజేపీ నాయకులు బద్దం మహిపాల్ రెడ్డి, పైడి ఎల్లారెడ్డి, ఆలె భాస్కర్, కె.జనార్దన్‌రెడ్డి, జగన్నాథ్, అశోక్ ముస్తపురే, శ్రీనివాస్‌గార్గె తదితరులు పాల్గొన్నారు.

కేతకిలో పూజలు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి కిషన్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా బుధవారం ఆలయానికి వచ్చిన ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఆయన పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందించి, పూలమాల శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే తాటిపల్లి వెంకట రమణారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధిరాణి రుద్రమదేవి, రాష్ట్ర నాయకులు జైపాల్ రెడ్డి ఆయన వెంట ఉన్నారు.

ఓఆర్‌ఆర్‌పై కారు బోల్తా

- ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి
- ముగ్గురికి తీవ్ర గాయాలు
- మేడ్చల్ నుంచి సదాశివపేటకు వెళ్తుండగా ఘటన



బోల్తా పడినకారు



శేశ్విక్(ఫైల్)

పటాన్‌చెరు టౌన్: రామేశ్వరంబండ సమీపంలోని అవుటర్ రింగ్ రోడ్డుపై ఓ కారు పోల్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒక ఇంజనీరింగ్ విద్యార్థి మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ ప్రవీణ్‌రెడ్డి, ఎస్‌ఐ వెంకటరెడ్డి కథనం ప్రకారం.. మేడ్చల్ ఉమానగర్ కాలనీకి చెందిన లక్ష్మారెడ్డి పెద్ద కుమారుడు హర్షిత్ రెడ్డి గోకరాజు రంగరాజు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం నాలుగో తరగతి చదువుతున్న తన సోదరుడు చార్విక్ రెడ్డిని సదాశివపేటలోని సెంట్‌ఆంథోని స్కూల్‌లో వదిలిపెట్టేందుకు మేడ్చల్ నుంచి కారులో బయలుదేరాడు. మల్లంపేట ఓఆర్‌ఆర్ వద్ద తన స్నేహితులైన ఆదిలాబాద్ బజార్హత్నూర్ వాసి కొత్త శేశ్విక్, వర్షిత్‌రెడ్డిని కారులో ఎక్కించుకొని సదాశివపేట వైపు బయలుదేరాడు. రామేశ్వరంబండ ఓఆర్‌ఆర్ సమీపంలోకి రాగానే కారు అదుపు తప్పి పోల్‌ను ఢీ కొట్టింది. దీంతో కొత్త శేశ్విక్(20) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన హర్షిత్ రెడ్డి, చార్విక్ రెడ్డి, వర్షిత్ రెడ్డిని చికిత్స కోసం మదీనగూడలోని శ్రీకర్ ఆసుపత్రి తరలించారు. మృతుడి తండ్రి లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఖేడ్ మున్సిపల్ చైర్మన్‌గా ఆనంద్

వైస్ చైర్మన్‌గా శంకర్





నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ కాంగ్రెస్ హస్తగతమయ్యింది. బుధవారం నిర్వహించిన ఎన్నికలో కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆనంద్ స్వరూప్ షెట్కార్ చైర్మన్‌గా, దారం శంకర్ వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించిన నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్ వసంతకుమారి ప్రకటించారు. దీంతో కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నాయి. ఈ నెల 2న అవిశ్వాసతీర్మానంపై నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్‌కు చెందిన ఎనిమిది మంది కౌన్సిలర్లతో పాటు బీఆర్‌ఎస్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులైన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కలిపి 13 మంది అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా చేతులెత్తారు. అవిశ్వాసతీర్మానం నెగ్గి చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లు పదవులు కోల్పోయారు. బుధవారం ఎన్నిక కోసం నిర్వహించిన సమావేశానికి 15 మంది కౌన్సిలర్లు, ముగ్గురు ఎక్స్‌అఫీషియో సభ్యులు కలిపి 18 మంది హాజరుకావాల్సి ఉండగా 11 మంది కౌన్సిలర్లతో పాటు ఎక్స్‌అఫీషియో సభ్యులైన స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి హాజరయ్యారు. ఎన్నిక నిర్వహించగా 6వ వార్డు కౌన్సిలర్ ఆనంద్ స్వరూప్ షెట్కార్ చైర్మన్‌గా 3వ వార్డు కౌన్సిలర్ దారం శంకర్ వైస్ చైర్మన్‌గా మాత్రమే దరఖాస్తులు సమర్పించడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి ప్రకటించి ధ్రువపత్రాలను అందజేశారు. ఎన్నికైనవారిని ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీఎంపీ సురేశ్ షెట్కార్, టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్, డీసీసీ ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డితోపాటు నాయకులు, కార్యకర్తలు సన్మానించారు.

గ్రంథాలయాలు యువతకు దేవాలయాలు

కలెక్టర్ వల్లూరు క్రాంతి



పాఠకుడితో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి: గ్రంథాలయాలు యువతకు దేవాలయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి అన్నారు. బుధవారం స్థానిక జిల్లా గ్రంథాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. గ్రంథాలయంలో పాఠకులకు అందుతున్న సేవలను, కావలసిన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పాఠకులను పలకరించి వారు ఏయే ఉద్యోగాలకు పోటీ పడుతున్నారో తెలుసుకున్నారు. త్వరలోనే పాఠకులు అక్షయ పాత్ర భోజనం ఏర్పాటుకు ఆదేశిస్తానని చెప్పారు. ఆమె వెంట తహసీల్దార్ దేవదాస్, జిల్లా గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెదక్ కలెక్టర్‌గా రాహుల్‌రాజ్

మెదక్: మెదక్ కలెక్టర్‌గా రాహుల్‌రాజ్ బుధవారం ఆదిలాబాద్ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన కలెక్టర్ రాజర్షిషా ఆదిలాబాద్‌కు బదిలీపై వెళ్లారు. 2023 ఫిబ్రవరి 1న సంగారెడ్డి నుంచి పదోన్నతిపై రాజర్షిషా మెదక్‌కు వచ్చారు. సుమారు 13 నెలల పాటు ఇక్కడ విధులు నిర్వర్తించారు. అసెంబ్లీ ఎన్నికలను దిగ్విజయంగా నిర్వహించారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆయన బదిలీ అయినట్లు తెలిసింది. అలాగే మెదక్ ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్ సైతం బదిలీపై ఆదిలాబాద్ జిల్లాకు వెళ్లారు.

ఆకలి తీర్చడం ప్రభుత్వాల బాధ్యత

సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ రమణ



బహుమతులు అందజేస్తున్న జస్టిస్ ఎల్‌వీ రమణ

కంది(సంగారెడ్డి): పౌష్టికాహారం తీసుకోవడం ప్రజలందరి ప్రాథమిక హక్కు, ప్రజల ఆకలి తీర్చడం ప్రభుత్వాల బాధ్యత అని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రమణ అన్నారు. బుధవారం కందిలో గల అక్షయ పాత్ర 15వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పిల్లలందరికీ పౌష్టికాహారం అందించి చదువును ప్రోత్సాహించాలన్న ఉద్దేశ్యంతో అక్షయపాత్ర ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. చాలా మంది బాల,బాలికలకు పౌష్టికాహారం అందక అనారోగ్యంతో బాధ పడుతున్నారని వాపోయారు. స్వాతంత్రం వచ్చి75 ఏళ్లు గడిచినా ఎంతో మంది బాల కార్మికులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలందరినీ శక్తి మంతులుగా తీర్చిదిద్దే బాధ్యత మనందరిపైనా ఉందని చెప్పారు. అనంతరం అక్షయ పాత్ర ఫౌండేషన్ చైర్మన్ మధు, పండిత ప్రభు, రిజినల్ చైర్మన్ సత్యగౌర చంద్ర దాస మాట్లాడారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులకు మెమెంటోలను అందజేశారు.

విద్యార్థులకు రాష్ట్రస్థాయి బహుమతులు

జోగిపేట(అందోల్): మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్న అక్షయపాత్ర సంస్థ పాఠశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో అందోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో బహుమతులు గెలుచుకున్నారు. బాస్కెట్ బాల్ విభాగంలో రాణించిన రొయ్యల చందన, ఎన్‌సీసీ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అవుసలి నిఖిల్ బహుమతులు సాధించారు. సుప్రీం కోర్ట్ పూర్వ జస్టిస్ యల్‌వీ రమణ వారికి బుధవారం బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దేవిదాస్, వ్యాయామ ఉపాధ్యాయలు వీడీ శ్రీనివాస్, ఎన్‌సీసీ అధికారి మాణయ్య తదితరులు విద్యార్థులను అభినందిచారు.

ఆర్థిక అవసరాలకే బ్యాంకుల సేవలు



మాట్లాడుతున్న కల్యాణ్ చక్రవర్తి

సంగారెడ్డి టౌన్ : ప్రజల ఆర్థిక అవసరాల కోసం బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల సేవలను వినియోగించుకోవాలని రిజర్వు బ్యాంకు డిప్యూటీ అంబుడ్స్‌మన్ కల్యాణ్ చక్రవర్తి సూచించారు. బుధవారం స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో కస్టమర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్థిక లావాదేవీలలో మోసాల నుంచి ఎలా తప్పించుకోవాలో వివరించారు. సమస్యల పరిష్కారం కోసం రిజర్వు బ్యాంకు అంబుడ్సమెన్ కు ఫిర్యాదు చేస్తే పరిష్కారం దొరుకుతుందన్నారు. అనంతరం బైక్ మెకానిక్ శిక్షణలో ఉన్న 30 మంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యకమంలో రిజర్వు బ్యాంకు మేనేజర్ ఆకెళ్ల లక్ష్మీశరణ్య, శిక్షణ సంస్థ డైరెక్టర్ వంగా రాజేంద్రప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ గోపాలరెడ్డి, రిజర్వ్ బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయస్థాయిలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

పటాన్‌చెరు టౌన్: అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారు 15 రాష్ట్రాల నుంచి 64 ప్రాజెక్టులు ఎంపిక చేసుకొని జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను జూమ్ ద్వారా నిర్వహించారు. ఇందులో పటాన్‌చెరు మండలం ఇంద్రేశం ప్రభుత్వ పాఠశాల 7,8 వ తరగతి విద్యార్థులైన ఉజ్జీవన్, జీవన్ కుమార్ ఎలాంటి ఖర్చు లేకుండా వృథాగా పడి ఉన్న వస్తువులను ఉపయోగించి తయారు చేసిన ×లెమన్ కట్టర్×ని వైజ్ఞానిక ప్రదర్శనలో చూపించారు. వీరి ప్రదర్శన ద్వితీయ బహుమతి గా ఎంపిక కావడంతో పాటు రూ. 12 వేల నగదు పొందినట్లు ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు.

సైన్స్‌ను కెరీర్‌గా ఎంచుకోండి

నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ గ్రెగ్ ఎల్.సెమెంజా

పటాన్‌చెరు : సైన్స్ (శాస్త్రం) ఎన్నో ఆవిష్కరణలకు బాటలు వేసి, మానవ జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహద పడుతుందని వర్తమాన శాస్త్రవేత్తలు, విద్యార్థులకు నోబెల్ బహుమతి గ్రహీత, జాన్స్ హాప్కిన్స్ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌లోని జెనిటిక్ మెడియన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ గ్రెగ్ ఎల్.సెమెంజాతో సూచించారు. 'రామన్ ఎఫెక్ట్' ఆవిష్కరణను పురస్కరించుకొని పటాన్‌చెరు మండలం రుద్రారం గీతం విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'భారతదేశ అభివృద్ధి కోసం దేశీయ పరిజ్ఞానం' అనే ఇతివృత్తంతో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రెగ్ మాట్లాడుతూ.. ముందుగా ఒక ఆలోచనతో ముందుకొచ్చి, దానిని పరీక్షించమని ఆయన సలహా ఇచ్చారు. ఇవన్నీ సొంత సృజనాత్మకత, మనం చేసే ఆలోచన నుంచి ఆధారపడి ఉంటాయని వివరించారు. అనంతరం గీతం అదనపు ప్రొఫెసర్ డీఎస్ రావు నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ గ్రెగ్ ఎల్.సెమెంజాను సన్మానించి, జ్ఞాపకం అందజేశారు.

కాలునొప్పి బాధ భరించలేక..

గృహిణి ఆత్మహత్య

వర్గల్(గజ్వేల్): ఉరేసుకొని గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం వర్గల్ మండలం వేలూరులో చోటు చేసుకుంది. గౌరారం ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వేలూరుకు చెందిన కాయిత రాజు, రాధ(33) దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. నాలుగేళ్ల కిందట పొలంలో పని చేస్తున్న రాధ కాలుకు ట్రాక్టర్ తగిలి కాలు విరిగింది. ఆపరేషన్ చేసి రాడ్ వేశారు. 20 రోజుల కిందట మరోసారి ఆపరేషన్ చేసి రాడ్ తొలగించారు. అప్పటి నుంచి ఆమె కాలు నొప్పితో బాధపడుతుంది. మంగళవారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులు భోజనం చేసి నిద్రపోయారు. అర్ధరాత్రి నిద్రలేచిన భర్తకు ఓ గదిలో రాధ ఉరేసుకొని విగత జీవిగా కన్పించింది. భార్య కాలు నొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకుందని రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లీపు సంవత్సరం రోజున పెళ్లి, బర్త్ డేలు

కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య సంబురాలు

అందరిలోనూ వీరు ప్రత్యేకం

నాలుగేళ్లకోసారి జరుపుకోనున్న వేడుకలు

హ్యాపీ లీప్ డే సందర్భంగా ప్రత్యేక కథనం..

అనగనగా ఈ రోజు..

నాలుగేళ్లకోసారి వచ్చే లీపు సంవత్సరం (ఫిబ్రవరి 29) అంటే అందరూ ప్రత్యేక రోజుగా పరిగణిస్తారు. ఇక ఆ రోజు పెళ్లి, పుట్టిన రోజు చేసుకోవడం అంటే మరీ స్పెషల్. వారి వేడుక జరుపుకోవడానికి నాలుగేళ్లు ఎదురుచూడడం కాస్త బాధగా ఉన్నా.. ఆ రోజు వచ్చిందంటే చాలు కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య చెప్పలేని ఆనందంతో సంబురాలు చేసుకుంటారు. గురువారం లీపు సంవత్సరం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం...

సాక్షి ప్రత్యేకం

February 29th Happy Leap Day!

నాలుగేళ్లకోసారి జరుపుకొంటాం



సుప్రియ, రాకేష్‌రెడ్డి వధూవరులతో తల్లిదండ్రులు

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి మండలం మహమ్మద్‌నగర్ గ్రామానికి చెందిన బాన్స్‌వాడ చంద్రకళ, భూపాల్‌రెడ్డి దంపతుల కూతురు సుప్రియ వివాహం హైదరాబాద్ కొంపల్లికి చెందిన మంజుల, శేక్‌రెడ్డి కుమారుడు రాకేష్‌రెడ్డితో ఈనెల 29న లీపు సంవత్సరం రోజున జరుగనుంది. సుప్రియ హైదరాబాద్‌లో సీఏ పూర్తి చేసి ప్రస్తుతం ఉద్యోగం చేస్తుంది. రాకేష్‌రెడ్డి సైతం సీఏ పూర్తి చేసి ఉద్యోగం చేస్తున్నాడు. వీరి పెళ్లి పెద్దలు కుదిర్చారు. 29న పెళ్లి ముహూర్తం బాగుందని చెప్పడంతో ఇరుకుటుంబాలు పెద్దలు, బంధువులు ఒప్పుకున్నారు. కలిసి జీవించే వాళ్లం కాబట్టి ముహూర్తాలకే ప్రాధాన్యం ఇచ్చాం పెళ్లి వార్షికోత్సవం నాలుగేళ్ల తర్వాత ఘనంగా జరుపుకుంటామని నూతన దంపతులు చెప్పుకొచ్చారు.

ముహూర్త బలం చూసి..



నూతన వధూవరులు నర్సింలు, శిరీష

పెళ్లి ముహూర్తమే ముఖ్యం అందుకే ముహూర్త బలం బాగుందని చెప్పడంతో 29న పెళ్లి చేసుకుంటున్నట్లు కౌడిపల్లి మండల రాయిలాపూర్ గ్రామానికి చెందిన పెళ్లి కొడుకు మన్నె నర్సింలు తెలిపారు. రాయిలాపూర్ గ్రామానికి చెందిన మన్నె శాంతమ్మ-అంజయ్య కుమారుడు నర్సింలు వివాహం కొల్చారం మండలం అంసాన్‌పల్లి గ్రామానికి చెందిన తమ్మలి లక్ష్మీ-ఆశయ్య కూతురు శిరీషతో గురువారం జరుగనుంది. నాలుగేళ్లకోసారి వచ్చే లీపు సంవత్సరం అయినప్పటికీ ముహూర్తమే ముఖ్యమని అందుకే పెళ్లి చేసుకుంటున్నట్లు చెప్పారు. అంతగా కావాలంటే తిథులు ఆధారంగా ప్రతీ సంవత్సరం వార్షికోత్సవం జరుపుకునే అవకాశం ఉంది.

నా ఫ్రెండ్స్‌లో నేను ఒక్కడినే..



శ్రావణ్‌రెడ్డి

నారాయణఖేడ్: తోటి మిత్రులు, బంధువుల్లో ఎవరికీ లేని స్పెషలే నా బర్త్‌డే.. నాలుగేళ్లకోమారు వచ్చే బర్త్ డే అంటే ఎంతో ఇష్టం.. నా బర్త్‌డే కోసం నాలుగేళ్లు ఎదురుచూస్తుంటా అని నాగల్‌గిద్ద మండలం వల్లూరు గ్రామానికి చెందిన శ్రావణ్‌రెడ్డి తెలిపారు. తల్లిదండ్రులు నవనీత, చంద్రశేఖర్‌రెడ్డిలు నారాయణఖేడ్‌లో నివాసం ఉంటారు. 6వ తరగతి చదువుతున్న శ్రావణ్‌రెడ్డి 2012 ఫిబ్రవరి 29న జన్మించాను. ఇప్పటి వరకు మూడు బర్త్‌డేలు చేసుకున్నాను. ఇది నాలుగవ బర్త్‌డే. స్పెషల్‌గా ఉన్న లీప్ ఇయర్ బర్త్‌డే అంటే ఎంతో సంతోషంగా ఉందటూ చెప్పుకొచ్చాడు.

రెండు గ్రామాల్లోనూ స్పెషల్..



నూతన మధూవరులు నరేశ్, అశ్విని

దుబ్బాకటౌన్: దుబ్బాక మండలం పెద్ద చీకోడ్‌కు చెందిన పున్న నరేశ్‌కు కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం బొమ్మకల్‌గా గ్రామానికి చెందిన అశ్విని లీప్ సంవత్సరం రోజునే వివాహ బంధంలోకి అడుగుపెడుతున్నారు. ఫిబ్రవరి 29నే ముహూర్తం రావడంతో ఇందుకు ఇరు కుటుంబాల వారు ఒప్పుకున్నారు. గురువారం బొమ్మకల్‌లో వివాహం జరుగనుంది. నాలుగేళ్లకోసారి వచ్చే లీపు సంవత్సరం రోజు పెళ్లి జరగడం రెండు గ్రామాల్లోనూ ప్రత్యేక ఆకర్షణగా మారింది.

అప్పట్లో తేదీలు చూడకుండానే..



మల్లం శ్రీనివాస్, కవిత దంపతులు

కొమురవెల్లి(సిద్దిపేట): ఈ ఫొటోలో కనిపిస్తున్న దంపతుల పేరు మల్లం శ్రీనివాస్ కవిత. వీరిది మండలంలోని అయినాపూర్ గ్రామం. వీరి వివాహం 2004 ఫిబ్రవరి 29న జరిగింది. ఆ రోజు తేదీ చూడకుండా ముహూర్త బలం చూసి పెద్దలు పెళ్లి చేశారు. ప్రతీ నాలుగేళ్లకోసారి పెళ్లి రోజు జరుపుకుంటున్నారు. వీరికి ఒక బాబు, పాప ఉన్నారు. వారి ఎంతో సంతోషంగా ఉందని దంపతులు చెప్పుకొచ్చారు.

తెలిసినా.. ఒప్పకున్నాం



మానస, అభిషేక్ (నూతన వధూవరులు)

ఈ ఫొటోలో కనిపిస్తున్న మానస అభిషేక్‌ల వివాహం నేడు (గురువారం) జరుగనుంది. మానసది మండలంలోని మత్రిముచ్చాల గ్రామం. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్నారు. వీరిది పెద్దలు కుదిర్చిన వివాహం. పెళ్లి ఫిబ్రవరి 29న వస్తుందని, ప్రతీ సంవత్సరం కాకుండా నాలుగేళ్లకోసారి పెళ్లిరోజు జరుపుకోవాల్సి వస్తుందని తెలుసు. కానీ 29న ముహూర్తం మంచిగా ఉండడంతో ముహూర్తానికి ప్రాధాన్యత ఇచ్చి వివాహం చేసుకుంటున్నారు.

ఊరంతా భోజనాలు



అమ్మ, నాన్నతో సాన్విక

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట 8 వార్డు కౌన్సిలర్ దుబ్బాక బాలకృష్ణ గౌడ్ నవత దంపతులకు 2020 సంవత్సరం ఫిబ్రవరి 29న అమ్మాయి సాన్విక జన్మించింది. 2020 లీపు సంవత్సరం నుంచి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా బర్త్ డే వేడుకలు జరుపుకోలేదు. దీంతో ఆ దంపతులు లీపు సంవత్సరం కోసం ఎదురుచూస్తున్నారు. 2024లో మళ్లీ ఫిబ్రవరి 29 లీపు సంవత్సరం కావడంతో నాలుగురెట్ల ఆనందంతో బర్త్ డే వేడుకలు జరపడానికి ఏర్పాట్లు చేశారు. ప్రతీ సంవత్సరం వేడుకలు జరుపుకోకపోవడం బాధగా ఉన్నా నాలుగేళ్లకు ఒక్కసారి ఊరంతా భోజనాలు పెట్టి ఆనందోత్సవాల నడుమ వేడుకలు చేయడం సంతోషంగా ఉందని బాలకృష్ణ గౌడ్ దంపతులు తెలిపారు.

12 ఏళ్లలో ఇది మూడోసారి..



బెజ్జంకి(సిద్దిపేట): లీపు సంవత్సరం అంటేనే ఒక థ్రిల్లింగ్.. ఆ రోజున పుట్టిన రోజు వేడుకంటే మరో స్పెషల్‌గా మారింది. నాకే కాకుండా కుటుంబ సభ్యులతో పాటు పాఠశాలలోని తోటి విద్యార్థులు నా జన్మదినాన్ని ప్రత్యేకంగా చెప్పుకుంటారు. 2012 నుంచి 12 ఏళ్లలో రెండుసార్లు జన్మదిన వేడుకలు జరుపుకున్నాను. ఇది మూడవ పుట్టినరోజు. ఈ సంవత్సరం ఫిబ్రవరి 29 రావడం ఎంతో ఆనందంగా ఉంది.

– రామంచ రచన, 7వ తరగతి

నేడు ఒక్కటి కానున్న జంట



శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేటకు చెందిన అరిగె నాగరాజు చిన్నశంకరంపేట చెందిన వెన్నెలతో పెళ్లి నిశ్చయమైంది. ప్రత్యేకంగా ఫిబ్రవరి 29 (లీపు సంవత్సరం)న పెళ్లి చేసేందుకు ఇరు కుటుంబాల పెద్దలు ముందుకొచ్చారు. అందుకు అనుగుణంగా గురువారం పెళ్లి జరిపించేందుకు ఏర్పాట్లు చేశారు. నాలుగేళ్లకోసారి ఘనంగా పెళ్లి వేడుకలు జరుపుకుంటామని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రత్యేక రోజుతోపాటు మంచి ముహూర్తం కావడంతో చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మళ్లీ ఇదే సంతోషంతో..



వట్‌పల్లి(అందోల్): నాలుగేళ్లకోసారి ఫిబ్రవరి 29వ తేదీన వివాహం చేసుకోవడమంటే మళ్లీ నాలుగేళ్ల తర్వాతే పెళ్లి రోజు చేసుకోవడం సమ్‌థింగ్ స్పెషల్‌గా ఉంటుంది. 29వ తేదీన బలమైన ముహూర్తంతోపాటు సమ్‌థింగ్ స్పెషల్ డేగా ఉంటుందని మా కుటుంబ సభ్యులతో మాట్లాడి మేము ఈ రోజును ఎంచుకున్నాం. మా పెళ్లి వేడుక నాలుగేళ్ల వేడుకగా మారుతుండడంతో సంతోషంగా ఉంది. అదే సంతోషంతో నాలుగేళ్ల తర్వాత జరుపుకుంటాం.

– మంగళి రమేశ్, భవానీ, దేవునూర్

44 ఏళ్లు.. పది సార్లు



నా పేరు దేవునూరి కృష్ణ. మాది అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామం. ప్రతి ఒక్కరు ఏడాదికోసారి పుట్టిన రోజు జరుపుకుంటారు. కానీ నేను నాలుగేళ్లకోసారి జరుపుకోవడం థ్రిల్లింగ్‌గా ఉంది. మా పిల్లలు డాడీ నీ బర్త్‌డే ఎప్పుడూ అని అడుగుతుంటారు. నా బర్త్‌డే నాలుగేళ్లకోసారి వస్తుందని చెప్పగానే అందేంటని వారు ఆశ్చపోతున్నారు. నేను 1980 ఫిబ్రవరి 29న జన్మించాను. నా వయస్సు 44 ఏళ్లు. 10 సార్లు మాత్రమే పుట్టిన రోజు జరుపుకున్నా.

– దేవునూరి కృష్ణ, కన్‌సాన్‌పల్లి

మూడో బర్త్‌డే..



అందోల్ మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన నోముల్నగారి సురేందర్‌రెడ్డి, సుప్రియ దంపతుల కుమారుడు కౌశిక్‌రెడ్డి. అందరిలా ఏడాదికోకసారి కాకుండా నాలుగేళ్లకోసారి బర్త్‌డే జరుపుకుంటాడు. 2012 ఫిబ్రవరి 29న జన్మించిన ఆయన ఇప్పటి వరకు రెండు సార్లు మాత్రమే పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నాడు. గురువారం మూడో బర్త్‌డే చేసుకోనున్నాడు. నాలుగేళ్లకోసారి జరుపుకోవడం సంతోషంగా ఉందన్నాడు.

మర్చిపోలేని రోజు..



జోగిపేట(అందోల్): మంచి ముహూర్తం ఉండడంతో ఫిబ్రవరి 29న (గురువారం పెళ్లి చేసుకోబోతున్నాం. అందరూ సంవత్సరానికి ఒక్కసారి పెళ్లి రోజు వేడుకలు జరుకుంటే మేము మాత్రం నాలుగేళ్ల కోసారి జరుపుకోవాలి. అందరికంటే భిన్నంగా ఉండాలనే ఈ రోజు పెళ్లి పెట్టుకున్నాం. నాలుగేళ్లకోసారి మా పెళ్లిరోజు వస్తుందని తెలిసినా మంచి ముహూర్తం, సమ్‌థింగ్ స్పెషల్‌గా ఉంటుందనే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాం. మా పెళ్లిరోజును ఉత్సాహంగా కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకొంటాం.

– సిలారపు త్రిష, మణికంఠ (మంత్రి దామోదర రాజనర్సింహ కూతురు)

పదకొండవ బర్త్ డే



డాకూర్ గ్రామానికి చెందిన ముప్పారం పద్మారావు 1980 ఫిబ్రవరి 29న జన్మించాడు. 44 ఏళ్ల ఉన్న ఇతను పది సార్లు మాత్రమే జన్మదినాన్ని జరుపుకున్నాడు. సినిమాల్లో జూనియర్ ఆర్టిస్ట్‌గా పని చేస్తున్న పద్మారావు పదకొండవ జన్మదినాన్ని స్నేహితులు, సన్నిహితులు, కుటుంబ సభ్యుల మధ్య గురువారం జరుపుకోవడానికి సిద్ధమయ్యాడు. నాలుగేళ్లకోసారి వచ్చే జన్మదినాన్ని ఘనంగా జరుపుకోవడం ఆనందంగా ఉంది.

– ముప్పారం పద్మారావు, జూనియర్ ఆర్టిస్ట్, డాకూరు గ్రామం

మొదట్లో బాధపడేవాడు



వినయ్ తేజ్

ఈ అబ్బాయి ఫిబ్రవరి 29, 2016వ సంవత్సరంలో జన్మించాడు. మా కుమారుడి పుట్టిన రోజు నాలుగేళ్లకోసారి వస్తుందని కొంత బాధగా ఉన్నా అందరూ గుర్తు పెట్టుకునేంత ప్రత్యేక దినం కావడంతో తాము అదృష్టంగా భావిస్తున్నాం. నా కుమారుడి పేరు మన్నె వినయ్ తేజ్. వాడి తెలివి వచ్చిన తర్వాత మమ్మీ నా బర్త్‌డే ప్రతీ సంవత్సరం ఎందుకు చేయడం లేదని అడిగే వాడు. అప్పుడు అతడికి నీ బర్త్ డే నాలుగేళ్లకోసారి వస్తుందని చెప్పాం. మొదట్లో బాధ పడ్డా రాను రాను అలవాటు చేసుకున్నాడు.

– మన్నె రాజమల్లయ్య, అర్చన (వినయ్ తేజ్ తల్లిదండ్రులు)

అదృష్టంగా భావిస్తున్నా ..



పుట్టినరోజు జరుపుకొంటున్న చంటి (ఫైల్)

చేర్యాల(సిద్దిపేట): ఫిబ్రవరి 29న జన్మించడం అదృష్టంగా భావిస్తున్నానని పట్టణంలోని 3వ వార్డు కౌన్సిలర్ మంగోలు చంటి అన్నారు. 1992 సంవత్సరంలో ఫిబ్రవరి 29న జన్మించిన చంటి గడిచిన ఏడు జన్మదినాలను కుటుంబ సభ్యుల మధ్య జరుపుకున్నారు. గురువారం 8వ జన్మదినాన్ని కౌన్సిలర్ హోదాలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో జరుపుకోనున్నట్లు తెలిపారు.

జాగిలాల పనితీరు ప్రశంసనీయం

సిద్దిపేట సీపీ అనురాధ



నూతన పోలీసు జాగిలాలతో సీపీ అనురాధ, డాగ్ స్క్వాడ్ సిబ్బంది

సిద్దిపేటకమాన్: నేరస్తులను పసిగట్టడంలో పోలీసు జాగిలాల పనితీరు ప్రశంసనీయమని సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ శిక్షణ కేంద్రంలో శిక్షణ ముగించుకున్న రెండు నూతన పోలీసు జాగిలాలు రానా, సిరిలను సిద్దిపేట పోలీసు కమిషనరేట్‌కు సిబ్బంది తీసుకొచ్చారు. పోలీసు జాగిలాలను సీపీ ఎదుట హాజరుపర్చగా వాటిని పరిశీలించి శిక్షణ, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ప్రస్తుతం జాగిలాల సంఖ్య తొమ్మిదికి చేరుకుందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ రామచంద్రరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ పూర్ణచందర్, ఆర్ఎస్ఐ రోహిత్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది భాను, నవీన్, వెంకటేశ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధమే కారణం

- నల్తూరు వాసి దారుణ హత్య
- నలుగురు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని మాదారం శివారులో ఇటీవల ఓ వ్యక్తి మృతి చెంది ఉన్న విషయం తెలిసిందే. గుర్తు తెలియని వ్యక్తి, అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లుగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు వివాహేతర సంబంధమే హత్యకు కారణంగా నిర్ధారించారు. బుధవారం సీఐ నయీముద్దీన్ కథనం ప్రకారం.. జిన్నారం మండలంలోని నల్తూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్(34) వడక్‌పల్లి గ్రామానికి చెందిన ఓ వివాహితతో వివాహేతర సంబంధం ఉంది. అప్పుడప్పుడూ రహస్యంగా కలుసుకునే వారు. ఆదివారం రాత్రి వడక్‌పల్లిలో ఆమె ఇంటికి వెళ్లాడు. మహిళతో శ్రీకాంత్ ఉన్న విషయాన్ని కుటుంబ సభ్యులు గుర్తించి దాడి చేశారు. మహిళ తండ్రి పోచయ్య, అన్న రవి, మామ రాములు, బావ విక్రమ్ చేసి కట్టెలతో తలపై బలంగా చితకబాదడంతో శ్రీకాంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని కారులో తీసుకొచ్చి మాదారం శివారులోని ఓ బ్రిడ్జి సమీపంలో పడేశారు. శ్రీకాంత్ మృతికి కారణమైన నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించి ఛేదించినందుకు పోలీసులను అభినందించారు.

వేసిన వలే మృత్యుపాశమై

చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి



ప్రభు మృతదేహం

కౌడిపల్లి(నర్సాపూర్): చేపలు పట్టేందుకు వెళ్లి చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన కౌడిపల్లి మండలం కొట్టాల గ్రామంలో చోటు చేసుకుంది. బుధవారం ఎస్ఐ రంజిత్‌రెడ్డి, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొడకండ్ల ప్రభు(42) మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లాడు. రాత్రి గడిచినా రాకపోవడంతో కుటుబ సభ్యులు గ్రామంలో వెతికారు. బుధవారం ఉదయం స్థానిక చౌదరి చెరువు కట్టపైన ప్రభు బట్టలు, చెప్పులు కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు చెరువులో వెతకగా ప్రభు మృతదేహం లభ్యమైంది. చెరువులో చేపలు పట్టేందుకు వచ్చి ప్రమాదవశాత్తు అతను వేసిన వల చుట్టుకోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడని తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భెల్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ..

- రూ.5.40 లక్షలు వసూలు
- నకిలీ పత్రాలు చూపెట్టి ఉద్యోగి మోసాలు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ పరిశ్రమలో కాంట్రాక్టు ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నకిలీ పత్రాలను చూపెట్టిన మోసం చేసిన భెల్ కార్మికుడిని బుధవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. భెల్ కాలనీలో నివాసముండే సత్య సీల్ 2010లో భెల్ పరిశ్రమలో కార్మికుడిగా ఉద్యోగంలో చేరాడు. 6 నెలల కిందట ఎమ్ఐజీ కాలనీలో నివాసముండే విట్టల్ రెడ్డితో స్నేహాన్ని ఏర్పరుచుకొని, పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుడిగా ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మించాడు. నకిలీ పత్రాలు చూపించి అతడి వద్ద డబ్బులు వసూలు చేశాడు. ఈ రకంగా ఏడుగురి నుంచి రూ.5 లక్షల 40 వేలు వసూలు చేశాడు. ఎంతకీ ఉద్యోగం ఇప్పించకపోవడంతో విట్టల్ రెడ్డి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీస్ దర్యాప్తులో సత్యసీల్ మోసాలన్నీ బయటపడ్డాయి. కాలనీలో సినిమా షూటింగ్‌లు జరుగుతుండడంతో అక్కడికి వెళ్లి షూటింగ్ కోసం వచ్చిన వారికి మాయమాటలు చెప్పి ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు తీసుకున్నట్లు విచారణలో తేలింది. 2022లో పరిశ్రమల్లో కాపర్ వైర్ దొంగిలించి జైలుకు వెళ్లినట్లు పోలీసులు వివరించారు. సత్యసీల్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పాపడ్ ప్యాకెట్లలో పురుగులు



తనిఖీలు చేస్తున్న అధికారులు

నారాయణఖేడ్: పట్టణంలోని ఎస్ఆర్ఆర్ మార్ట్‌లో పురుగులతో ఉన్న పాపడ్లు (బొంగులను) విక్రయిస్తున్నారని వినియోగదారులు బుధవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి మార్ట్‌లో పాపడ్లు కొనుగోలు చేయగా అందులో పురుగులు ఉన్నాయి. మాల్ నిర్వాహకులను ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్, సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. దుకాణంలోని బస్తాల్లో నిల్వ ఉన్న పాపడ్‌లలో పురుగులు ఉన్నట్లు గుర్తించారు. మొదటి తప్పుగా భావించి రూ.5 వేలు కాంపౌండ్ ఫీజుగా వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు.